సాక్షి
విశాఖపట్నం
గురువారం । 3 । ఆగస్టు । 2023



పరిపాలనలో అద్భుత మార్పులు

సచివాలయాలతో పరిపాలన వ్యవస్థలో అద్భుతమైన మార్పులు వచ్చాయని సీడీఎంఏ కోటేశ్వరరావు అన్నారు. 8లో



జాతీయ జెండా ప్రదర్శన

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతిని పురస్కరించుకొని భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. 8లో

చరిత్రలో నిలిచిపోయేలా..



'ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 16న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి వెల్లడించారు. 8లో

న్యూస్‌రీల్

డిజిటల్ రూపంలో ఆర్‌సీ, డీఎల్



గోపాలపట్నం : ఇక నుంచి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలు డిజిటల్ రూపంలో రానున్నాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం తెలిపారు. ప్రస్తుతం డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డులకు పోస్టల్ చార్జీతో కలుపుకొని రూ.250 చెల్లిస్తున్నారని, శనివారం నుంచి ఫీజు వసూళ్లు నిలిపి వేస్తున్నామని పేర్కొన్నారు. శనివారం నుంచి అన్ని డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఆర్‌సీలు డిజిటల్ రూపంలోనే జారీ చేస్తామన్నారు. ఇప్పటికే ఫీజులు చెల్లించిన వారికి డీఎల్, ఆర్‌సీలు కార్డులు వచ్చిన తరువాత జారీ చేస్తామన్నారు. సెల్‌ఫోన్లు లేనివారు కార్డులు ప్రింట్ తీసుకొని తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి నేటి నుంచి కౌన్సెలింగ్



కంచరపాలెం ప్రభుత్వ ఐటీఐ

కంచరపాలెం: జిల్లాలోని 3 ప్రభుత్వ, 29 ప్రైవేటు ఐటీఐల్లో మిగుల సీట్ల భర్తీకి ఈ నెల 3, 4 తేదీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఆన్‌లైన్‌లో 2,908 మంది దరఖాస్తు చేసుకోగా 2,544 మంది మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని కౌన్సెలింగ్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. అభ్యర్థుల ఫోన్‌కు సమాచారం పంపించినట్లు తెలిపారు. గురువారం 1 నుంచి 1069 ర్యాంకు వరకు, శుక్రవారం 1070 నుంచి 2,544 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

వైద్యుల పోస్టులకు 7న ఇంటర్వ్యూ



మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో పలు సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీకి గాను ఈనెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఆంధ్ర వైద్య కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు అభ్యర్థులు నేరుగా హాజరుకావచ్చన్నారు. వివరాలకు https@//www.amc.edu.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.


నిందితులకు కఠిన శిక్ష పడేలా చర్యలు



మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: నిందితులపై కేసుల విషయంలో ప్రత్యేకంగా దృష్టి పెట్టి వారికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో కోర్టు మానిటరింగ్ సిస్టం(సీఎంఎస్) సిబ్బంది, అన్ని స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కేసులు మరింత సమర్థవంతంగా, వేగంగా కోర్టులో ట్రయిల్‌కు వచ్చే విధంగా పలు సూచనలు చేసి వెంటనే అమలు చేయాలని చెప్పారు. సీఎంఎస్, ఎస్‌హెచ్‌ఓలు పూర్తి సమన్వయంతో పనిచేస్తూ కోర్టులో నిందితులకు శిక్ష పడేంత వరకు పూర్తి మోనిటరింగ్ చేయాలన్నారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్స్, గంజాయి రవాణాదారులపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. ప్రతి నెలా శిక్షలు పడుతున్న కేసుల సంఖ్య పెరుగుదల కనిపించాలని స్పష్టం చేశారు.

పారా బ్యాడ్మింటన్ పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న కమిషనర్ సాయికాంత్

విశాఖ స్పోర్ట్స్: పారా బ్యాడ్మింటన్ పోటీల పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం విడుదల చేశారు. ఈ పోటీలు రైల్వేస్టేడియం ఇండోర్ ఎన్‌క్లేవ్‌లో ఈనెల 15వ తేదీన జరగనున్నాయి. అంతర జిల్లాల జట్లు ఈ పోటీల్లో పాల్గొంటుండగా సత్తాచాటిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు.

రాత్రి వేళ విమానాలు బంద్!



ఎయిర్‌పోర్టులో విమానం నైట్ ల్యాండింగ్ (ఫైల్)

- నవంబరు 15 నుంచి మార్చి వరకు..
- ఎయిర్‌పోర్టు రన్‌వేపై రీ–సర్ఫేసింగ్ పనులు
- పదేళ్లకోసారి వీటిని చేపట్టనున్న నేవీ అధికారులు
- రాత్రి 9 నుంచి ఉదయం 8 గంటల దాకా విమాన సర్వీసులు రద్దు
- మూసివేత సమయాన్ని తగ్గించాలని విమానాశ్రయ అధికారుల వినతి

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఐదున్నర నెలలపాటు రాత్రి వేళ విమాన సర్వీసులు నిలిచిపోనున్నాయి. ఆ సమయంలో పదకొండు గంటల పాటు విమానాల రాకపోకలు రద్దు కానున్నాయి. విశాఖ ఎయిర్‌పోర్టు నావికాదళం ఆధీనంలో ఉంది. నేవీ యుద్ధ విమానాలు, ఎయిర్‌క్రాఫ్టులు ఐఎన్‌ఎస్ డేగా రన్‌వే నుంచే కార్యకలాపాలు సాగిస్తాయి. పౌర విమానాలు కూడా ఐఎన్‌ఎస్ డేగా నియంత్రణలో ఉన్న ఈ రన్‌వే మీదుగానే ల్యాండింగ్, టేకాఫ్‌లు జరుగుతాయి. నావికాదళం ప్రతి పదేళ్లకోసారి తమ రన్‌వేలకు రీ–సర్ఫేసింగ్ పనులను చేపడుతుంది. ఈ ప్రక్రియలో రన్‌వేపై మూడు పొరలను తొలగించి మళ్లీ కొత్తగా వేస్తారు. ఇంకా అవసరమైన ఇతర పనులు చేపడతారు. ఐఎన్‌ఎస్ డేగాలో 2009లో రీ–సర్ఫేసింగ్ నిర్వహించారు. పదేళ్ల తర్వాత అంటే.. 2019లో మరోసారి నిర్వహించాల్సి ఉన్నా ఇప్పటివరకు జరగలేదు. ఈ ఏడాది ఈ రీ–సర్ఫేసింగ్‌ను నవంబర్ 15 నుంచి మార్చి నెలాఖరు వరకు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పనులను రాత్రి 9 గంటల నుంచి మర్నాడు ఉదయం 8 గంటల వరకు చేపడతారు. అందువల్ల ఆ సమయంలో ఈ రన్‌వేను మూసివేస్తారు. దీంతో ఈ 11 గంటల్లో విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలను నిలిపివేస్తారు. ఫలితంగా దాదాపు 12 విమాన సర్వీసులకు అంతరాయం కలగనుంది. వీటిలో సింగపూర్ వెళ్లే ఏకైక అంతర్జాతీయ సర్వీసుతో పాటు ఢిల్లీ, హైదరాబాద్, పూణే, బెంగళూరు, కోల్‌కతా విమానాలున్నాయి. ఈ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం రోజుకు 30 టేకాఫ్‌లు, 30 ల్యాండింగులు జరుగుతున్నాయి.

పర్యాటక సీజను వేళ

ఏటా అక్టోబర్ నుంచి పర్యాటక సీజను ప్రారంభమవుతుంది. ఈ సీజనులో వివిధ ప్రాంతాల నుంచి విశాఖకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఇలా ఐదారు నెలల పాటు విమానాలకు పర్యాటకుల రద్దీ కొనసాగుతుంది. సాధారణంగా వింటర్ సీజనులో పర్యాటకుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలు తమ షెడ్యూళ్లను పెంచుతుంటాయి. కానీ ఈ ఏడాది వింటర్ పీక్ సీజనులో రీ–సర్ఫేసింగ్ మొదలవుతుండడంతో రాత్రి పూట విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. అదనపు షెడ్యూళ్లు పెంచడానికి బదులు తగ్గే అవకాశాలున్నాయి. నేవీ రీ–సర్ఫేసింగ్ దృష్ట్యా తమ సర్వీసుల షెడ్యూల్ వేళల్లో తగిన మార్పులు చేసుకోవాలని ఇప్పటికే సంబంధిత విమానయాన సంస్థలకు సూచిస్తున్నారు.

మూసివేత సమయం తగ్గించాలని కోరాం..



రీ–సర్ఫేసింగ్‌లో భాగంగా ఐఎన్‌ఎస్ డేగా రన్‌వేను నవంబరు 15 నుంచి మార్చి ఆఖరు వరకు రాత్రి వేళ 11 గంటల సేపు మూసివేయనున్నట్టు నేవీ నుంచి సమాచారం అందింది. దీనివల్ల రాత్రి 9 నుంచి మర్నాడు ఉదయం 8 గంటల మధ్య విమానాల రాకపోకలు సాగించే వీలుండదు. ఆ సమయంలో 12 ముఖ్య విమాన సర్వీసులు రద్దవుతాయి. అందువల్ల రాత్రి 10.30 నుంచి మర్నాడు 6.30 గంటల వరకు (8 గంటలు) రన్‌వే మూసివేత సడలించాలని నేవీ ఉన్నతాధికారులను కోరాం. దానిపై ఇంకా ఏ సమాచారం లేదు. నేవీ రీ–సర్ఫేసింగ్ విషయాన్ని మా ఎయిర్‌పోర్టు అథారిటీ ప్రధాన కార్యాలయానికి నివేదించాం. అలాగే రీ–సర్ఫేసింగ్ నేపథ్యంలో షెడ్యూళ్లను సర్దుబాటు చేసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించాం.

– ఎస్.రాజారెడ్డి, డైరెక్టర్, విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం

నమ్ముకున్న వారికి అందలం



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కోలా గురువులు. చిత్రంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు వాసుపల్లి, నాగిరెడ్డి, అదీప్‌రాజ్, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు తదితరులు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కోలా గురువులు బాధ్యతల స్వీకరణ

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీని నమ్ముకున్న వారికి న్యాయం జరుగుతుందని, ఇందుకు నిదర్శనం కోలా గురువులే అని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. మద్దిలపాలెంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వై.వి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ విశాఖ అధ్యక్షుడిగా కోలా గురువులు బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా నేతలు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ పరిపాలన రాజధాని కాబోతున్న విశాఖకు పార్టీ అధ్యక్షుడిగా కోలా గురువులకు ముఖ్యమంత్రి బరువైన బాధ్యతలను అప్పగించారన్నారు. రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించాలన్నారు. రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కోసం అహర్నిశలు కృషి చేసిన కోలా గురువులకు సీఎం జగన్ గుండెల్లో స్థానం ఉందన్నారు. ఈ ఏడాది దసరాకి ఈ ప్రాంత వాసుల చిరకాల కోరిక నెరవేరుతుందన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. డీసీసీబీ చైర్మన్‌గా, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులకు సీఎం జగన్ ఇచ్చిన కానుకగా కోలా గురువులకు ఇచ్చిన పదవులను చెప్పుకోవచ్చన్నారు. నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు మాట్లాడుతూ ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికి పదవులు వరిస్తాయనేదానికి తామే నిదర్శనమన్నారు. మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే నాగిరెడ్డిలు మాట్లాడుతూ గురువులతో తమకు మంచి అనుబంధం ఉందన్నారు. ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారంటే సీఎం జగన్ ఇష్టపడతారని, వారికి ఉన్నత స్థానం కల్పిస్తారన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ పండుల రవీంద్రబాబు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్, పార్టీ అనకాపల్లి అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకట్రామయ్య, రాష్ట్ర సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ వంగపండు ఉష, డిప్యూటీ మేయర్లు కె.సతీష్, జియ్యాని శ్రీధర్, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు శోభాస్వాతిరాణి, పి.సుజాత, కార్పొరేటర్లు బానాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, కంపా హనోక్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, విల్లూరి భాస్కరరావు, సాడి పద్మారెడ్డి, తిప్పల వంశీరెడ్డి, శశికళ, జైన్, ముఖ్య నాయకులు సీతంరాజు సుధాకర్, కొండా రాజీవ్ గాంధీ, అల్లంపల్లి రాజుబాబు, శ్రీకాంత్ రాజు, కె.వి.బాబా, మారుతీప్రసాద్, రామన్నపాత్రుడు, నడింపల్లి కృష్ణంరాజు, కలిదిండి బద్రినాథ్, పేర్ల విజయచందర్, జోనల్, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ల నియామకం

సీతంపేట : రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. భీమిలి నియోజకవర్గానికి భీమిలి ఆర్డీవో, విశాఖ తూర్పు నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ) స్టీల్‌ప్లాంట్, విశాఖ దక్షిణ నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ ప్రొటెక్షన్, విశాఖ ఉత్తర నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌హెచ్–16, విశాఖ పశ్చిమ నియోజకవర్గానికి విశాఖ ఆర్డీవో, గాజువాక నియోజకవర్గానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అండ్ ఎస్టేట్ ఆఫీసర్ వీఎంఆర్‌డీఏ, పెందుర్తికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్‌ఆర్‌సీ)ను నియమించారు. చోడవరానికి ది ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్, విశాఖపట్నం, మాడుగులకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్‌ఏ) ఏపీఐఐసీ, విశాఖపట్నం, అరుకువేలికి ఐటీడీఏ పాడేరు ప్రాజెక్టు ఆఫీసర్, పాడేరుకు అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్, అనకాపల్లికి అనకాపల్లి ఆర్డీవో, యలమంచిలికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌ఏవోటీ, యలమంచిలి, పాయకరావుపేటకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌పీ) సింహాచలం దేవస్థానం, నర్సీపట్నంకు నర్సీపట్నం సబ్ కలెక్టర్/ఆర్డీవోను నియమించారు.

సీఎం జగన్ పర్యటన రేపు

కూనవరం మండలంలో వరద ప్రభావిత ప్రాంతాల సందర్శన



చింతూరు/కూనవరం: గోదావరి వరద ముంపునకు గురైన కూనవరం మండలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పర్యటించనున్నారు. ఈమేరకు షెడ్యూల్ ఖరారైంది.

- ఉదయం 10.20కు కూనవరం మండలం కోతులగుట్టలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.20 నుంచి 10.30 వరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై హెలిప్యాడ్ వద్ద అధికారులను అడిగి తెలుసుకుంటారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.35కు కోతులగుట్ట నుంచి బయలుదేరి 10.50కు కూనవరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు.
- ఉదయం10.50 నుంచి మధ్యాహ్నం 12.20 వరకు కూనవరం, వీఆర్‌పురం మండలాలకు చెందిన వరద బాధితులతో ఆయన మాట్లాడతారు.
- 12.20కు కూనవరంలో బయలుదేరి 12.35కు తిరిగి కోతులగుట్టలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుని 12.40కు తాడేపల్లి బయలుదేరుతారు.

వృద్ధుడి నేత్రదానంతో ఇద్దరికి చూపు

ఆరిలోవ: వృద్ధాప్యంతో మృతి చెందిన ఓ వ్యక్తి కళ్లను ఆయన కుమారులు దానం చేసి ఆదర్శంగా నిలిచారు. 11వ వార్డు పరిధి పార్వతీనగర్‌కు చెందిన లంకపల్లి కృష్ణ(75) బుధవారం మరణించారు. అవయదానంపై అవగాహన ఉన్న అతని కుమారులు ఎల్.రమణ, ఎల్.సురేష్ తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రిలోని మోహిసిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించారు. దీంతో ఎల్వీపీ కంటి వైద్యులు, ఐ బ్యాంక్ ప్రతినిధులు పార్వతీనగర్ చేరుకున్నారు. మృతుడి రెండు కళ్ల నుంచి కార్నియాలు సేకరించి.. ఐ బ్యాంక్‌లో భద్రపరిచారు. నేత్రదానం చేసిన కృష్ణ కుటుంబ సభ్యులను అభినందించి ధ్రువీకరణపత్రం అందించారు. నేత్రదానంపై అపోహలు వీడాలని పిలుపునిచ్చారు.



కృష్ణ కుమారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న మోహిసిన్ ఐ బ్యాంక్ వైద్యులు

'ఆడుదాం ఆంధ్ర' లోగో, మస్కట్ ఎంపిక పోటీలు

విశాఖ స్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2న ప్రారంభించే 'ఆడుదాం ఆంధ్ర' లోగో, మస్కట్ డిజైన్ కోసం పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న వారు డిజైన్లు రూపొందించి ఆగస్టు 7వ తేదీలోగా https://sports.ap.gov.in/#/లో దరఖాస్తు చేసుకోవచ్చు. పోటీలో ఎంపికైన విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండో బహుమతిగా రూ.30 వేలు, మూడవ బహుమతిగా రూ.20 వేలు ఇవ్వనున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

- గర్భిణులు, బాలింతలకు ఎంతో ఉపయోగకరం
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

మహారాణిపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం టేక్ హోమ్ రేషన్ పంపిణీ కార్యక్రమం బుధవారం జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు ఇంటి వద్దకే పోషకాహారం అందించడం జరుగుతుందన్నారు. సరుకులు వద్దన్న వారు పాత పద్ధతిలోనే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయవచ్చన్నారు. జిల్లా పరిషత్ స్థాయీ మహిళా కమిటీ చైర్‌పర్సన్ డి.అనురాధ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయదేవి మాట్లాడుతూ పిల్లలు, గర్భిణుల ఆరోగ్య సమతుల్యతకు పోషకాహారం సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కు పరిరక్షణ సభ్యుడు గొండు సీతారాం, రీజనల్ మహిళా చైర్‌పర్సన్ ఎం.మాధవి వర్మ, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, జిల్లా ఇమ్యూనైజేషన్ ఆఫీసర్ జీవన్‌రాణి, కేర్ కోఆర్డినేటర్ కె.ఎస్.సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, సీడీపీవోలు, అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



గర్భిణులు, బాలింతలతో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఇతర అధికారులు

జిల్లాలో వివరాలు : జిల్లాలో 17,386 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. గర్భిణులు, బాలింతలకు ఫేజ్–1లో 3 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, 500 మిల్లీ లీటర్ల నూనె, 2.5 లీటర్ల పాలు, 13 గుడ్లు, పోషకాహార కిట్ ద్వారా రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, 250 గ్రాముల బెల్లం, 250 గ్రాముల వేరుశెనగ చెక్కి, ఎండు ఖర్జూరం 250 గ్రాములు పంపిణీ చేస్తున్నారు. ఫేజ్–2లో 2.5 లీటర్ల పాలు, 12 గుడ్లు అందజేస్తున్నారు.

సీఎంకి కృతజ్ఞతలు



మాది పేద కుటుంబం, నా భర్త చిన్న ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా కుటుంబానికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ సరుకుల వల్ల నాలో ఎంతో శక్తి వచ్చినట్టుగా ఉంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– ఎస్.పద్మ, కృష్ణ నగర్, గర్భిణీ

సరకులు ఎంతో ఉపయోగం



చిన్న నూడిల్స్ షాపు ద్వారా వచ్చే ఆదాయంతో నా కుటుంబం జీవనం సాగిస్తోంది. రెండో కాన్పులో ఆడ శిశువు జన్మించింది. ఇద్దరు పిల్లలతో నడుస్తున్న నా కుటుంబానికి ఈ సరకులు చాలా ఉపయోగంగా ఉన్నాయి. రక్తం లేదు పోషకాహారం తినమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో ఈ సరకులు వాడుతున్నాను.

– ఎస్.సంపూర్ణ, కృష్ణనగర్, బాలింతరాలు

147 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



డాబాగార్డెన్స్ : జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నగర వీధుల్లో 147 అడుగుల భారీ జాతీయ జెండాను ప్రదర్శించారు. పాతనగరంలోని సంస్థ నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి రాణిబొమ్మ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని దేశభక్తి చాటుకున్నారు. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. పార్లమెంట్‌లో పింగళి వెంకయ్య విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతోపాటు భారతరత్న ప్రకటించాలని, అధికారికంగా ఆయన జయంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

చరిత్రలో నిలిచిపోయేలా..

ఏసీఏ 70 వసంతాల వేడుక

- 16న సీఎం జగన్ చేతులమీదుగా ఏపీఎల్ సీజన్–2 ప్రారంభం
- వైఎస్సార్ స్టేడియంలో పైలాన్ ఆవిష్కరణ
- బీసీసీఐ కార్యదర్శి జై షాను ఆహ్వానించాం
- 'సాక్షి'తో ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి వెల్లడి

విశాఖ స్పోర్ట్స్: 'ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భం మాకు ఎంతో ప్రత్యేకం. ఈ నెల 16వ తేదీని ఏసీఏ చరిత్రలోనే గుర్తుండిపోయేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో పైలాన్ ఆవిష్కరణకు సర్వం సిద్ధం చేస్తున్నాం. ఆంధ్రా ప్రీమియర్ లీగ్(ఏపీఎల్) రెండో సీజన్‌ను ఆ రోజు సీఎం జగన్ ప్రారంభించనున్నారు. కడపలోని వైఎస్సార్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఫ్లడ్‌లైట్లను విశాఖ నుంచే వర్చువల్‌గా ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఏసీఏ ఉన్నతికి కృషి చేసిన అధ్యక్ష, కార్యదర్శులు, ఆటగాళ్లు, సహాయక సిబ్బందిని సత్కరించనున్నాం. ఇప్పటికే ఏసీఏ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి ఈ కార్యక్రమానికి బీసీసీఐ కార్యదర్శి జై షాను ఆహ్వానించారు.' అని ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి తెలిపారు. ఏసీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన 'సాక్షి'కి వివరించారు.

తొలి సీజన్‌లోనే గుర్తింపు

ఏపీఎల్ లోగోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించడంతో తొలి సీజన్‌కు శ్రీకారం జరిగింది. ఆ సీజన్ విజయవంతం కావడంతో బీసీసీఐ నుంచి మంచి గుర్తింపు వచ్చింది. ఏసీఏ అధ్యక్షుడు శరత్ చంద్రారెడ్డి దార్శనికత.. గవర్నింగ్ కౌన్సిల్‌లో ఎవరు బాధ్యతలు వారు సక్రమంగా నిర్వర్తించడంతోనే ఈ విజయం సాధ్యమైంది. ఐపీఎల్‌కు వేలం నిర్వహించే చారుశర్మ ఏపీఎల్ వేలం పాట నిర్వహించడం విశేషం.



గోపినాథ్‌రెడ్డి, ఏసీఏ కార్యదర్శి

సక్సెస్‌కు కారణం ఇదే..

ఏపీఎల్ ప్రారంభంలో చాలా విమర్శలు ఎదుర్కొన్నాం. ఆరు ఫ్రాంచైజీలు వస్తాయా అని అన్నారు. సీజన్ ప్రారంభం కాక ముందే మమ్మల్ని నమ్మి ఆరు ఫ్రాంచైజీలు ముందుకొచ్చాయి. వారంతా చాలా ఫ్యాషనేట్‌గా ఉన్నారు. మూడేళ్ల కోసం అడిగితే రెండేళ్లకు పూర్తి మొత్తం చెల్లించి ష్యూరిటీ ఇచ్చారు. ఇదే తొలి సీజన్ సక్సెస్‌కు కారణమైంది.

ఫ్రాంచైజీల కోసం పోటీ..

ప్రతి ఫ్రాంచైజీని ఏడాదికి రూ.70 లక్షలు కట్టమని అడిగాం. వాటి నుంచే రూ.35 లక్షలను ఆటగాళ్ల బిడ్డింగ్‌కు తిరిగి ఇచ్చాం. ప్రతీ ఫ్రాంచైజీ 20 మంది కోసం రూ.35 లక్షలకు మించకుండా ఆటగాళ్ల కోసం వెచ్చించింది. మిగిలిన మొత్తంతో అన్ని జట్ల ఆటగాళ్లకు వసతి, భోజనం తదితర సౌకర్యాలకు వెచ్చించాం. తొలి సీజన్ విజయవంతం కావడంతో ఇప్పుడు చాలా మంది ఫ్రాంచైజీ కోసం పోటీ పడుతున్నారు.

అందుకే ఆలస్యమైంది..

ఏపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు తర్వాతే లీగ్ నిర్వహణ చేపట్టాలి. ఏజీఎంలో ప్రస్తుత సీజన్ ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించేందుకు, గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం. స్టార్‌స్పోర్ట్స్‌లో మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారానికి ఒప్పందం కుదుర్చుకున్నాం. అయితే అప్పటికే ఏపీఎల్ నిర్వహణపై కొందరు కోర్టును ఆశ్రయించారు. ఎస్‌జీఎంలో నిర్ణయం తీసుకోవడం ఏమిటి? ఏజీఎంలో నిర్ణయాలు తీసుకోవాలంటూ కోర్టును ఆశ్రయించారు. సింగిల్ జడ్జికి వారు వెళ్లగా... బెంచ్‌ను ఏసీఏ ఆశ్రయించడంతో తీర్పును రిజర్వ్ చేశారు. ఏజీఎంలోనే నిర్ణయం జరగాలనే కోర్ట్ కేసు ఉండటంతో.. ఈ సారి ఏజీఎంలోనే నిబంధనల మేరకు 21 రోజుల నోటీస్‌తోనే ప్రొవిజన్ అనుసరించాం. దీంతో ఈ సారి ఏపీఎల్ సీజన్ నిర్వహణ కాస్త ఆలస్యం అయింది. గతంలో జూలైలోనే తొలిసీజన్ పూర్తయింది.

వేలం సాగిందిలా..

ఐపీఎల్ ముగిసిన 15 రోజుల అనంతరం దేశంలో ప్రీమియర్ లీగ్‌లు ప్రారంభం అవుతాయి. మ్యాచ్‌ల నిర్వహణకు 15 రోజుల వ్యవధి ఉంటుంది. అనంతరం రంజీ సీజన్, ఆసియన్ కప్ తదితరాల షెడ్యూల్ వచ్చేస్తుంది. ఈ వ్యవధి దాటితే సీజన్‌కు అంతరాయం వస్తుంది. దీంతో ఆటగాళ్లకు ఓ ఏడాది వృథా అవుతుంది. ఐపీఎల్ తరహాలోనే ఈ సీజన్ వేలం జరిగింది. ప్రతి ఫ్రాంచైజీ ఆరుగురిని నిలుపుకుంటూ.. మిగిలిన వారిని ఓపెన్‌లో ఇచ్చేశారు. 567 మందితో పాటు వారందరికీ వేలం జరిగింది. ఏ, బీ, సీ కేటగిరీలుగా వారు ఆడిన స్థాయిని బట్టి వరసగా రూ.లక్ష, రూ.50 వేలు, రూ.25 వేల బేస్ బిడ్‌గా నిర్ణయించాం.

కడపలో ఈ సారి మ్యాచ్‌లు లేనట్లే..

ఈ సీజన్‌లో విశాఖతో పాటు కడపలోనూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో కొన్ని మ్యాచ్‌లు నిర్వహణకు సన్నాహాలు చేశాం. అక్కడ కొన్ని మ్యాచ్‌లు జరిగితే స్థానిక ఆటగాళ్లకు మేలు జరుగుతుందని ఆశించాం. అయితే కోర్టు కేసుతో అంతరాయం కలిగింది. ఈ సీజన్‌లో 19 మ్యాచ్‌లను విశాఖలోని వైఎస్సార్ స్టేడియంలోనే ప్రతిరోజూ రెండు మ్యాచ్‌లను నిర్వహించే విధంగా షెడ్యూల్ ఖరారు చేశాం. ఒక మ్యాచ్ డే కాగా... రెండో మ్యాచ్ డేనైట్‌గా ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఉంటుంది. రౌండ్ రాబిన్ అనంతరం నాకవుట్‌కు ఓ రోజు విరామం ఇస్తాం. చివరి మూడు రోజులు నాకవుట్ జరగనుండగా టైటిల్ పోరుకి ఆటంకం ఏర్పడితే 28న నిర్వహిస్తామని గోపినాథ్ రెడ్డి వివరించారు.

కానిస్టేబుల్ అనుమానాస్పద మృతి



బర్రి రమేష్(ఫైల్)

ఎంవీపీకాలనీ : నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బర్రి రమేష్ (35) అనుమానాస్పద స్థితిలో బుధవారం మృతి చెందాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2009 బ్యాచ్‌కు చెందిన రమేష్ కొన్నేళ్లుగా వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్ పనిచేస్తున్నాడు. ఇతనిది నగరంలోని కొబ్బరితోట కాగా భార్య, ఇద్దరు పిల్లలతో ఎంవీపీ కాలనీ దరి ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి రమేష్ ఇంట్లోనే మద్యం సేవించి అనంతరం నిద్రపోయాడు. ఉదయం అతని భార్య చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించింది. అయితే ఇంట్లో సమస్యలు ఏమీ లేవని.. మద్యం సేవించి చనిపోయాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని ఎంవీపీ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

సచివాలయాలతో పరిపాలనలో అద్భుత మార్పులు

సీడీఎంఏ కోటేశ్వరరావు



మాట్లాడుతున్న సీడీఎంఏ, ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: గ్రామ/వార్డు సచివాలయాలతో పరిపాలన వ్యవస్థలో అద్భుతమైన మార్పులు వచ్చాయని చీఫ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ), విశాఖపట్నం ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు అన్నారు. షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి పక్కన ఎంపీఈపీ స్కూల్ వద్ద గల ఆడిటోరియంలో బుధవారం సచివాలయాల కార్యదర్శులు, బీఎల్‌వోలకు డిజిటల్ అండ్ సోషల్ మీడియాపై అవగాహన తరగతులు నిర్వహించారు. టెలీ కమ్యూనికేషన్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్ సహకారంతో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వార్డు సెక్రటరీస్ ట్రెనింగ్ పుస్తకం ఆవిష్కరించారు. ఆయన ఆయనే మాట్లాడుతూ కార్యదర్శులు తమ సేవలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. గతంలో ప్రజలు వివిధ సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే వారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి.. వారికి కావాల్సిన సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలను తెలుసుకుని.. వాటిని అందజేయడంలో సహకరిస్తున్నారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 30 లక్షల మందికి వివిధ రకాల ధ్రువీకరణపత్రాలు అందజేసినట్లు చెప్పారు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అంజేస్తున్నట్లు తెలిపారు. ఐదు రోజుల పాటు 11 బ్యాచ్‌లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 575 సచివాలయాల బీఎల్‌వోలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సచివాలయ వ్యవస్థపై పలువురు కార్యదర్శుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎ.వి.జి.వర్మ, గాజువాక జెడ్సీ పి.సింహాచలం, భీమిలి జెడ్సీ రాము, మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ అధినేత శ్రీధర్‌రెడ్డి, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేస్తాం

వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



వై.వి.సుబ్బారెడ్డిని కలిసి చర్చిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గంగవరం పోర్టు కార్మికులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం చేస్తామని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. గంగవరం పోర్టు కార్మికులు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డితో కలసి బుధవారం సుబ్బారెడ్డిని కలిశారు. తమ సమస్యలు విన్నవించారు. స్పందించిన ఆయన కార్మికులకు అండగా ఉంటామని చెప్పారు. గంగవరం పోర్టు యాజమాన్యంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, లమ్మోరు, మాద అప్పారావు, గంటిపిల్లి లక్ష్మయ్య, నొల్లి స్వామి, సత్యానందం ఉన్నారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్



తనిఖీలు నిర్వహిస్తున్న అదనపు ఎస్పీ స్వరూపారాణి

ఎంవీపీకాలనీ: జిల్లా విజిలెన్స్ అదనపు ఎస్పీ స్వరూపారాణి ఆధ్వర్యంలో బుధవారం ఎంవీపీకాలనీలోని ఉషోదయ కూడలి ఆర్‌బీకే మిల్క్ ఫుడ్స్ అండ్ మీల్స్ కర్రీపాయింట్ షాపులో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్ ద్వారా చేసే మోసాలపై ఈ తనిఖీలు జరిగాయి. ఇందులో భాగంగా 10 డొమెస్టిక్, 8 కమర్షియల్ సిలిండర్లను సీజ్ చేశారు. మోసాలకు పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. గ్యాస్ సిలిండర్ల వినియోగంలో జరుగుతున్న మోసాలపై వస్తున్న ఫిర్యాదుల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు అదనపు ఎస్పీ స్వరూపారాణి వెల్లడించారు. సీఐ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.


యువకుడిని కాపాడిన లైఫ్‌గార్డ్స్



సాయిచంద్‌ను కాపాడిన లైఫ్ గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్ వద్ద సముద్రంలో కొట్టుకుపోతున్న యువకుడిని లైఫ్ గార్డ్స్ కాపాడారు. వివరాలివీ.. కైలాసపురం కస్తూరినగర్‌కు చెందిన బి.సాయిచంద్ బుధవారం సాయంత్రం తన స్నేహితులతో సరదాగా గడిపేందుకు ఇక్కడ బీచ్‌కు చేరుకున్నాడు. కాసేపు వారితో కబుర్ల అనంతరం తాను ఒక్కడే స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగాడు. ఈ క్రమంలో అలల తాకిడికి సాయిచంద్ కొట్టుకుపోతుండగా.. లైఫ్‌గార్డ్స్ ఎస్.నూకరాజు, జి.సతీష్, ఎం.అమ్మోరు, జి.చిన్నప్పన్న గమనించారు. వెంటనే రంగంలోకి దిగి యువకుడిని సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. మెరైన్ పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి అతన్ని ఇంటికి పంపించారు.

కారుతో బీభత్సం సృష్టించిన వైద్యుడి అరెస్ట్



ఫుట్‌పాత్‌పై బైకులను ధ్వంసం చేసిన కారు

బీచ్ రోడ్డు: మద్యం మత్తులో కారు డ్రైవ్ చేస్తూ అర్ధరాత్రి బీభత్సం సృష్టించిన వైద్యుడిని మూడో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం రాత్రి వీఐపీ రోడ్డులోని ఓ బార్‌లో పలువురు వైద్యులు మద్యం సేవించారు. ఇంటికి వెళ్లేందుకు కిందకి వచ్చిన వైద్యులు కారు కోసం వేచి ఉన్నారు. రెస్టారెంట్ సిబ్బంది పార్కింగ్ స్థలం నుంచి కారు తీసుకొని వచ్చి వైద్యుడు ముఖర్జీకి అప్పగించారు. ఆయన మద్యం మత్తులో కారు ఎక్కి ఎక్సిలేటర్‌ను గట్టిగా తొక్కడంతో కారు ఫుట్‌పాత్ పైకి ఎక్కి పక్కనే ఉన్న చెట్టు మీదకు దూసుకుపోయింది. ఈ ఘటనలో ఆరు ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కారును సీజ్ చేసి, వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎంసీలో అడ్మిషన్లు ప్రారంభం

మహారాణిపేట : ఆంధ్ర వైద్య కళాశాల (ఏఎంసీ)లో ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లకు శ్రీకారం చుట్టారు. తొలి విడతగా ఎంబీబీఎస్‌లో అఖిల భారత కోటా మొదటి కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమయింది. తొలి కౌన్సెలింగ్‌లో పది మంది విద్యార్థులకు ఎంబీబీఎస్‌లో అడ్మిషన్లు ఇచ్చినట్టు ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు.

రుషికొండలో ఆకతాయి చేష్టలు



దెబ్బతిన్న 'ఎన్' అక్షరం

కొమ్మాది: బీచ్‌రోడ్డు సుందరీకరణలో భాగంగా ముఖ్యమైన ప్రదేశాలు, కూడళ్లు, కల్వర్టుల వద్ద జీవీఎంసీ ఆకర్షణీయమైన ఆకృతాలను ఏర్పాటు చేసింది. ఇవి ఎంతగానో సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అయితే కొందరు ఆకతాయిలు తమ చేష్టలతో జీవీఎంసీ లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నారు. రుషికొండ ఐటీ జంక్షన్ వద్ద రోడ్డుకు ఆనుకుని కల్వర్టుపై 'రుషికొండ' పేరుతో బోర్డు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి ఆకతాయిలు 'ఎన్' అనే అక్షరాన్ని ధ్వంసం చేశారు. ఇలాంటి వాటి వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సందర్శకులు కోరుతున్నారు.

5న దేవులపల్లి అమర్ రాక

మహారాణిపేట:

ఆంధ్రప్రదేశ్ నేషనల్ మీడియా, అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుడు దేవులపల్లి అమర్ ఈనెల 5న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి మధ్యాహ్నం 3.50 గంటలకు విశాఖ చేరుకొని రాత్రి సర్క్యూట్ హౌస్‌లో బస చేస్తారు. 6వ తేదీన ఉదయం 9 గంటలకు రోడ్డు మార్గం ద్వారా విజయనగరం వెళ్తారు. అక్కడ స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని సాయంత్రం 5.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. 7వ తేదీన స్థానికంగా పలు కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 4.25 గంటలకు ఇండిగో విమానంలో తిరిగి హైదరాబాద్ వెళ్తారు.

సినీ గాయకుడు ధనుంజయ్‌కి డాక్టరేట్



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ధనుంజయ్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సంగీత విభాగం పరిశోధక విద్యార్థి, సినీ గాయకుడు సీపాన ధనుంజయ్‌కి ఏయూ డాక్టరేట్ లభించింది. విభాగ ఆచార్యులు సరస్వతి విద్యార్థి పర్యవేక్షణలో '1960–2020 మధ్య కాలంలో సినీ సంగీతంలో వీణ, వయొలిన్, వేణువుల వినియోగం–అధ్యయనం' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను ధనుంజయ్ స్వీకరించారు.

ప్రమాదాల నివారణకు ఆర్టీసీ చర్యలు

డాబాగార్డెన్స్: ప్రమాదాల నివారణకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్ బుధవారం జోన్–1 పరిధిలో గల డిపో మేనేజర్లతో భేటీ అయ్యారు. డిపోల రూట్ మ్యాప్‌లు పరిశీలించడంతోపాటు ఆర్అండ్‌బీ, రీజనల్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ, లోకల్ మున్సిపాలిటీలు రూపొందించిన ప్రమాద నివారణ చర్యలపై పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని, ఎక్కడికక్కడ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డాక్యుమెంటరీతో డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో విజయనగరం, విశాఖపట్నంలో గల అన్ని డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయాలి

విశాఖ విద్య: విద్యార్థుల అభ్యున్నతికి అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ అన్నారు. బుధవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీను తనిఖీ చేశారు. కాలేజీలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా అంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరుశాతంపై ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగమణిని అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డు విద్యా క్యాలెండర్ మేరకు బోధన సాగాలన్నారు. విద్యార్థులను క్రమశిక్షణతో మెలిగేలా వారిని పర్యవేక్షించాలన్నారు. ప్రతీ పీరియడ్‌లో విద్యార్థుల హాజరు నమోదు చేయాలన్నారు. విద్యార్థులు గైర్హాజరైతే వారి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లి క్రమం తప్పకుండా కాలేజీకి హాజరయ్యేలా అధ్యాపకులు తగిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రాక్టికల్స్ నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఆయన వెంట డీవీఈవో కార్యాలయ సిబ్బంది రామారావు తదితరులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

మురళీనగర్: ఏపీఎస్ఎస్‌డీసీ, జిల్లా ఉపాధి కల్పన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 4న కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయం ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు 10 ప్రముఖ కంపెనీలు 450 పోస్టుల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయి. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైన నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, బీటెక్, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావచ్చు. ఎంపికైన అభ్యర్థులకు వారి అర్హతల ఆధారంగా రూ.10వేల నుంచి రూ.25 వేల వరకు జీతాలు చెల్లిస్తారు. వీరు విశాఖపట్నం, తుని ప్రాంతాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులు. మరిన్ని వివరాలకు 99593 77669, 92925 53352లో సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి సుబ్బిరెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ చైతన్య సూచించారు.